
ప్రజాశక్తి
ఆదివారం 22 డిసెంబర్ 2024



28 నుంచి 31 వరకు
ఎపిజివిబి సేవలు నిలిపివేత

ప్రజాశక్తి- విజయనగరం కోట

భారత ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం ఆదేశానుసారం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు సేవలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మాత్రమే పరిమితం కానున్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు శాఖలు "తెలంగాణ గ్రామీణ బ్యాంకుతో విలీనమై తమ కార్యకలాపాలను కొనసాగిస్తాయి. ఈ విభజన క్రమంలో ఏర్పడే సాంకేతిక సమస్యల కారణంగా ఈనెల 28 నుంచి 31వరకు అన్ని శాఖలలో బ్యాంకింగ్ సేవలు, అన్ని ఆన్ లైన్ లావాదేవీలు, ఖాతాదారుల సేవా కేంద్రాలు అందుబాటులో ఉండవని విజయనగరం రీజనల్ మేనేజర్ డి.రామకృష్ణరాజు తెలిపారు.

ఆరుగాలం కష్టపడి చెమటోడ్చి పంట పండించిన రైతన్నలను వర్షాలు నిండా ముంచేశాయి. ఈ ఏడాది పంటలు బాగా పండాయి.. పిల్లాపాపలతో పండగ బాగా సాగిపోతుందన్న గంపెడాశలతో ఎదురుచూస్తున్న రైతులను అల్పపీడనం కోలుకోలేని విధంగా దెబ్బతీసింది. పంట చేతికొచ్చే తరుణంలో నాలుగు రోజులపాటు కురిసిన వర్షాలు తీవ్ర నష్టాలను కలిగించాయి. వేల ఎకరాల్లో వరిపంట ఇంకా పొలాల్లోనే దిబ్బలుగా ఉండటంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది.



భోగాపురంలో నీటమునిగిన వరిచేను

చివరిలో నిండా ముంచేసింది

- పొలాల్లో తడిసిన వరిచేను
- ఎక్కడికక్కడ నానుతున్న కుప్పలు
- ధాన్యం రంగు మారే అవకాశం
- అల్పపీడనం దెబ్బకు కుదేలైన రైతులు

ప్రజాశక్తి-చీపురుపల్లి, డెంకాడ

ఈ ఏడాది చీపురుపల్లి మండలంలో సుమారు 6800 ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేశారు. 5800 ఎకరాల వరకు వరి పంట నూర్పులను రైతులు పూర్తి చేశారు. అధికారుల లెక్కల ప్రకారం చీపురుపల్లి మండలంలో ఇంకా సుమారు వెయ్యి ఎకరాలకు పైగా వరి నూర్పులను పూర్తి చేయాల్సి ఉంది. కోసిన వరి పంటను పొలాల్లోనే కుప్పలు పెట్టి రైతులు ధీమాగా ఉన్న సమయంలో అకాల వర్షాలు వారిని తీవ్ర నష్టాల పాల్జేశాయి. పొలాల్లో కుప్పలు వేసిన వరిచేను పైపొర, కింద పొర తడిసి, ధాన్యం మొలకెత్తే ప్రమాదం ఉందంటూ రైతులు వాపోతున్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన టార్పాలిన్లు అరకొరగా సరఫరా చేయడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. పొలాల్లో కుప్పలుగా మిగిలిపోయి మొలకలు ఎత్తడానికి సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేసి, రైతులు నష్టపోకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. మండలంలో 14 రైతు సేవా కేంద్రాల ద్వారా 9159 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా, 7828 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు.

కష్టమంతా నీటిపాలు

డెంకాడ మండలంలో వరి సాధారణ విస్తీర్ణం 12,500 ఎకరాలు కాగా, ఈ ఏడాది 10 వేల ఎకరాల వరకు సాగైంది. ఇందులో సగం వరి పంటను కోత కోసం, నూర్పిడి చేసి, మిల్లులకు ధాన్యం తరలించారు. మిగిలిన వరిపంట పొలాల్లోనే కోసి దిబ్బలు పెట్టారు. మరికొన్నిచోట్ల వరిని కోయకుండా ఉంచారు. అల్పపీడనం వల్ల నాలుగు రోజులపాటు కురిసిన వర్షాలకు పొలాల్లో నీరు చేరడం, కుప్పలు నానిపోవడంతో ధాన్యం రంగు మారే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. పెట్టిన పెట్టుబడి చేతికి అందకుండా పోతుందని వాపోతున్నారు. మండలంలో ఇప్పటివరకు 50 ఎకరాల్లో మొక్కజొన్న వర్షపు నీటిలో మునిగిపోయింది.



డెంకాడ.. వరికుప్పలు నానిపోయాయని ఆవేదన వ్యక్తంచేస్తున్న రైతు కృష్ణమూర్తి

12,532 ఎకరాల్లో పంట నష్టం

- 30 ఎకరాల్లో వరి, 1852 ఎకరాల్లో మొక్కజొన్న
- అపరాలు 10,645 ఎకరాలు

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

జిల్లాలో ఈనెల 18 నుంచి 21 వరకు నాలుగు రోజుల్లో 109.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. శనివారం కూడా ఉదయం నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఎడతెరిపిలేకుండా జల్లులు పడుతునే ఉన్నాయి. పలుగ్రామాల పంటపొలాల్లో వర్షపు నీరు చేరి వరి, పెసర, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లాలో వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం... ఇప్పటి వరకు అన్ని పంటలూ కలిపి 12,532 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. 30 ఎకరాల్లో వరిపనలు నీట మునగగా, మొక్కజొన్న 1852 ఎకరాలుఅపరాలు 10,645 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. వరిచేలను కాపాడుకునేందుకు రైతులు వ్యయాప్రయాసాలు పడుతున్నారు. భారీ వర్షాల కారణంగా జరిగిన పంట నష్టం వివరాలను నమోదు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లా మని జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు తెలిపారు.

వరికి అపారనష్టం


గుర్ల : అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో మండలంలో వరి పంటకు అపారనష్టం వాటిల్లింది. పంట కోత కోసి పొలాల్లో కుప్పలుగా వేసిన తరుణంలో నీరుచేరడంతో ధాన్యం రంగుమారే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాల్లో ఉన్న వరికుప్పలను రైతులు ఎప్పటికప్పుడు పరిశీలించి మొలకలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎఒ తిరుపతిరావు సూచించారు. మండలంలో 13,600 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉండగా, పది వేల మెట్రిక్ టన్నులు సేకరించినట్లు తెలిపారు.

ముందుకొచ్చిన సముద్రం

పూసపాటిరేగ : బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనంతో తీరంలో అలలు ఉవ్వెత్తిన ఎగిసి పడుతున్నాయి. చింతపల్లి తీరంలో 50 మీటర్ల మేర సముద్రం ముందుకు వచ్చింది. దీంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజులుగా అధికారులు వేట నిలిపేయడంతో మత్స్యకారులు పూట గడవడం లేదని వాపోతున్నారు. జిల్లాలోని భోగాపురం, పూసపాటిరేగలో మండలాల్లోని 19 మత్స్యకార గ్రామాల్లో వేటపై ఆధార పడిన మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరుస తుపాన్లతో జీవనం కష్టంగా మారిందని వాపోతున్నారు. వేట నిషేధ కాలంలో ఇస్తామన్న రూ.20 వేల భృతి ఇవ్వలేదంటూ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



డెంకాడ మండలం గుణుపూరుపేటలో వరి కుప్పలు వేసిన పొలాల్లో చేరిన నీరు



పూసపాటిరేగ.. చింతపల్లిలో ముందుకొచ్చిన సముద్రం



మహాసభలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్

పాఠ్యాంశాల్లో మత ప్రస్తావన తగదు

విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్న బిజెపికి బుద్ధిచెప్పండి : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి / గజపతినగరం

పాఠ్యాంశాల్లో మత ప్రస్తావన ఏమాత్రం తగదని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్ అన్నారు. ఇటువంటి విధానాలతో విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి విద్యార్థిలోకం తగిన గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. అంతర్జాతీయంగా అనేక దేశాల్లో విద్యార్థులు ఇటువంటి పాత్ర పోషిస్తున్నారని గుర్తుచేశారు. గజపతినగరంలోని పాల్తేరువారి కల్యాణ మండపంలో ఎస్ఎఫ్ఐ 32వ జిల్లా మహాసభ శనివారం ప్రారంభమైంది. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాము అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశాన్ని అభివృద్ధి చేయడం, సమస్యలు పరిష్కరించడం చేతకాని బిజెపి ప్రభుత్వం ప్రజల దృష్టి మళ్లించేందుకు కుల, మతాల ప్రస్తావన (ఆర్ఎస్ఎస్ విధానాలు) తెస్తోందని విమర్శించారు. ఇందుకోసం దేశ రాజ్యాంగాన్ని కూడా కాలరాస్తోందన్నారు. అందులో భాగంగానే ఇటీవల పార్లమెంట్ సమావేశాల్లో అంబేద్కర్‌ను స్మరించుకోవడం పట్ల కేంద్రం హోం శాఖ మంత్రి అమిత్‌షా తీవ్ర అసహనం వ్యక్తం చేశారని వివరించారు. సామాజిక స్పృహ, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, శాస్త్రీయ ఆలోచనలు కల్పించే విద్యను పక్కనబెట్టి నూతన విద్యావిధానం పేరిట అంబానీ, అదానీలకు గుమస్తాలుగా పనిచేసే విద్యను తెరపైకి తెచ్చారని విమర్శించారు. నోరు మెదిపితే ప్రశ్నిస్తా అంటూ వల్లెవేస్తున్న డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ వీటన్నింటిపైనా ఎందుకు ప్రశ్నించడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నప్పటికీ విద్యార్థులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. ఇప్పటికైనా ఫీజురియింబర్స్‌మెంట్, అమ్మ ఒడి తదితర హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.



ప్రసంగిస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా పూర్వ కార్యదర్శి జి.శ్రీనివాస్

ఎస్ఎఫ్ఐ జిల్లా పూర్వ కార్యదర్శి గొర్లె శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రయివేటీకరణ విధానాల ప్రవేశం తరువాత విద్య వ్యాపారంగా మారిపోయిందని అన్నారు. కార్పొరేట్ కాలేజీల ఫీజుల దోపిడీతో పేద విద్యార్థులు చదువుకు దూరమౌతుండగా, కాస్త అవకాశం ఉన్నవారు తమ సంపాదనంతా పిల్లల చదువుకోసమే వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. దీంతో, డబ్బే సర్వస్వం అనే ధోరణి పెరిగిందని, సమాజాభివృద్ధికి, సామాజిక స్పృహకు దోహదపడే అంశాలు తగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మెరుగైన సమాజం రావాలంటే 10శాతం నిధులు కేటాయించడంతో పాటు విద్యా విధానాల్లో మార్పురావాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారానే విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అన్ని తరగతులవారికీ అందుబాటులోకి వస్తుందన్నారు. విద్యాసంస్థల్లో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కులం, మతం జొప్పిస్తూ యువతను తప్పుతోవ పట్టించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. చేగువేరా, అంబేద్కర్, అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో పాలకుల కుట్రను అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేష్ మాట్లాడుతూ పాఠశాలలు, వసతిగృహాల్లోని సమస్యలు పరిష్కరించాలంటూ ఎమ్మెల్యేలకు విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ పరిష్కరించకుండా కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయకపోతే పాలకులకు నిలదీతకు గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇప్పటికే ఎస్ఎఫ్ఐ పోరాటం వల్ల ఎన్నో సమస్యలు పరిష్కారమయ్యాయని, జిల్లాలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీల ఏర్పాటు వెనుక ఎస్ఎఫ్ఐ కృషి ఉందని వివరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ ఎస్.సమీరా మాట్లాడుతూ మనువాదం పేరుతో మహిళలను చిన్నచూపు చూస్తున్న బిజెపి ప్రభుత్వం విద్యార్థి దశ నుంచే విద్యకు దూరం చేసి, అణిచివేస్తోందని అన్నారు. ప్రారంభ సభ అనంతరం ప్రతినిధుల సభ కొనసాగింది. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు.



సభకు హాజరైన విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు

స్కూల్ భవనాల నిర్మాణానికి న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ సహాయం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పూసపాటిరేగ మండలంలో తమ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల భవనాల నిర్మాణానికి ముందుకు వచ్చింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద తమ సంస్థ ఆధ్వర్యంలో నెల్లిమర్ల నియోజకవర్గంలో సామజిక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ఈ సంస్థ నిర్ణయించింది. దీనిలో భాగంగా పూసపాటిరేగ మండలం నడిపల్లి, చింతపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు రూ.54.50 లక్షలతో అదనపు తరగతి భవనాలు నిర్మించేందుకు అంగీకరించింది. ఈ మేరకు సంస్థ అదనపు చీఫ్ ఇంజనీర్ బల్ల రవికుమార్, జిల్లా కలెక్టర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్‌ను శనివారం కలెక్టర్ కార్యాలయంలో కలిసి జిల్లా యంత్రాంగంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో సిపిఒ పి. బాలాజీ పాల్గొన్నారు.

ఆర్ఎస్‌కెను సందర్శించిన జెసి

బొండపల్లి : మండలంలోని వెంద్రాం గ్రామ సచివాలయాన్ని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ శనివారం సందర్శించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులను రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు గోనె సంచులు అందుబాటులో లేవని, బయట మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సి వస్తోందని సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు, పలువురు రైతులు.. జెసి దృష్టికి తీసుకొచ్చారు. సరిపడా గోనె సంచులు అందుబాటులో ఉంచాలని రైతులు కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ డి.రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి.. నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన నిరసనలు

ప్రజాశక్తి-బొబ్బిలి

రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సిపిఎం ఆధ్వర్యాన పట్టణంలోని చిక్కాలవీధిలో శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు మాట్లాడుతూ రాజ్యాంగం కోసం మాట్లాడేటప్పుడు అంబేద్కర్ పేరు స్మరించకుండా ఏ ఒక్కరూ మాట్లాడటం సాధ్యం కాదన్నారు. మతోన్మాద, మనువాద సిద్ధాంతాన్ని జీర్ణించుకున్న అమిత్ షా లాంటి వ్యక్తి హోంమంత్రిగా పనికిరారని చెప్పారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వానికి మద్దతిస్తున్న టిడిపి, వైసిపిలు... దళిత, గిరిజనుల వైపు ఉంటాయా? బిజెపి వైపు ఉంటాయా? ఆలోచించుకోవాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బలస శ్రీను, జి.గౌరేష్, ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం : అంబేద్కర్‌పై కేంద్రమంత్రి అమిత్ షా వ్యాఖ్యలకు వ్యతిరేకంగా పురిటిపెంటలోని ఎస్‌సి కాలనీలో అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం నాయకులు రాకోటి రాములు ఆధ్వర్యాన మౌనం పాటించి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచే రాజ్యాంగాన్ని రచించిన బి.ఆర్.అంబేద్కర్‌ను ఉద్దేశించి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోవింద, రాంబాబు, ఆర్.హరికృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి : సిపిఐ

బొబ్బిలి : బి.ఆర్.అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. నేర చరిత్ర కలిగిన అమిత్ షా.. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో సిపిఐ నాయకులు అలమండ ఆనందరావు, కోట అప్పన్న, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : రాజ్యసభలో బాబా సాహెబ్ డాక్టర్ అంబేద్కర్‌ను అవమానిస్తూ మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలని డిబిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యర్శి పి.చిట్టిబాబు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ఆ సంఘం కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటాలను ప్రదర్శించి, అమిత్‌షా తీరును ఖండించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ 75 ఏళ్ల భారత రాజ్యాంగంపై చర్చ జరుగుతున్న సమయంలోనే- ఆ రాజ్యాంగ నిర్మాతను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం దారుణమని, ఆయన తక్షణం క్షమాపణ చెప్పటంతో పాటు తన పదవి నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌సి, ఎస్‌టి ప్రజా ప్రతినిధుల సమాఖ్య కన్వీనర్ కింతాడ రవి, మాదిగ రిజ్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు జొన్నాడ చిన్నారావు, దళిత స్త్రీ శక్తి ప్రతినిది వి.రమ్య, అంబేద్కర్ సంఘ నాయకులు తొడిపురి చిన్నయ్య, డిబిఎస్‌యు చీపురుపల్లి కన్వీనర్ మొండూరు పోతురాజు తదితరులు పాల్గొన్నారు.



గజపతినగరం.. మౌనం పాటిస్తూ నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

డిఎంహెచ్ఒగా జీవనరాణి నియామకం

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ జీవనరాణి నియ మితులయ్యారు. పలు జిల్లాల డిఎంహెచ్ఒలను బదిలీచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు డిఎంహెచ్ఒగా ఉన్న డాక్టర్ ఎస్.భాస్కరరావును పార్వతీపురం మన్యంజిల్లాకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో విశాఖ జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిగా ఉన్న జీవన రాణిని ఇక్కడ డిఎంహెచ్ఒగా నియమించారు.



జీవనరాణి

రబీకి పంటల బీమా చేయించాలి

పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక : డిఎఒ

విజయనగరంకోట : జిల్లాలో ఈనెల 18 నుంచి 21 వరకు నాలుగు రోజుల్లో 109.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యిందని ఈ కారణంగా కొన్ని గ్రామాల్లో పొలాల్లోకి వర్షపు నీరు చేరి 12,532 ఎకరాల్లో పలుపంటలకు నష్టం వాటిల్లిందని జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు తెలిపారు. వర్షాల కారణంగా జరిగిన పంట నష్టం వివరాలను నమోదు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లా మని తెలిపారు. జిల్లాలో రబీ పంటలకు సంబంధించి 5801 హెక్టార్లలో మొక్కజొన్న, 4081 హెక్టార్లలో పెసర, 10,067 హెక్టార్లలో మినుము పంట సాగు జరుగుతోందన్నారు. జిల్లాలో పంటల బీమా పరిధిలో ఉన్న వరి, మొక్కజొన్న, పెసర, మినుము తదితర పంటలకు బీమా ప్రీమియం చెల్లింపు తేదీని ఈ నెలాఖరు వరకు పొడిగించినట్లు తెలిపారు. రైతులంతా వెంటనే బీమా ప్రీమియం చెల్లించేందుకు తమ రైతు సేవా కేంద్రం అసిస్టెంట్ ను సంప్రదించి వరి పంటకు ప్రతి ఎకరాకు రూ.630, మొక్కజొన్న కు రూ.540, పెసర మినుము పంటలకు రూ.300 వంతున ప్రీమియం చెల్లించి బీమా సదుపాయం పొందవచ్చన్నారు. దీంతో పాటు ఈ- పంట సాగు ధ్రువీకరణ పత్రాన్ని కూడా పొంది బ్యాంకులో ప్రీమియం మొత్తాన్ని చెల్లించవచ్చని పేర్కొన్నారు.

సమన్వయంతో అభివృద్ధికి కృషి

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరంకోట

అభివృద్ధి పథకాలకు కేంద్రం నుంచి సంపూర్ణ సహకారం అందుతోందని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 73 కేంద్ర పథకాలు ప్రారంభమ య్యాయని, మరో 20 పథకాలు కూడా త్వరలో అమలు కానున్నాయని చెప్పారు. జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై అందరికీ అవగాహన కల్పించి, ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకొనేలా చూడాలని సూచించారు. జాతీయ రహదారుల నిర్మాణానికి భారీ వాహనాలను వినియోగిస్తుండటంతో, పలుచోట్ల దానిని ఆనుకొని ఉన్న రహదారులు దెబ్బతిన్నాయని చెప్పారు. సామాజిక బాధ్యతగా ఈ రహదారులను ఆ కాంట్రాక్టర్ చేతే బాగుచేయించాలని సూచించారు.

దిశ ఛైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కేంద్ర పథకాలు రాష్ట్రంలో సక్రమంగా అమలు కాలేదని అన్నారు. కంద్ర పథకాల అమల్లో గానీ, ఎంపి ల్యాడ్స్ వినియోగంలో గాని నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని కోరారు. సమయాన్ని, నిధులను పూర్తిగా ప్రజల కోసమే వెచ్చిస్తామని స్పష్టం చేశారు. ఎంపి ల్యాడ్స్‌ను విద్య, వైద్యం కోసం ఎక్కువగా కేటాయి స్తామన్నారు. ఎంపి ల్యాడ్స్ నుంచి చేనేత కార్మికుల సంక్షేమం కోసం ఇప్పటికే కోటి రూపాయలను కేటాయించా మని, మిగిలిన నిధులను అన్ని నియోజకవర్గాలకు సమానంగా ఖర్చు చేస్తామన్నారు. జిల్లాలో జాతీయ రహదారుల అనుసంధానానికి, కొత్త రహదారుల నిర్మాణానికి, రైల్వే పరంగా అభివృద్ధికి ఆయా మంత్రిత్వ శాఖలకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. గరివిడి పశు వైద్య కళాశాలలో పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరామని వెల్లడించారు. కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ సూర్యఘర్ పథకాన్ని జిల్లాలోని ఎస్‌సి, ఎస్‌టిలంతా వినియోగించుకునేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఎంఎల్ఎలు కోళ్ల లలితకుమారి, లోకం నాగమాధవి మాట్లాడారు. తమ నియోజకవర్గంలోని పలు సమస్యలను ప్రస్తావించి, వాటిని పరిష్కరించాలని కోరారు. జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, డిప్యూటీ సిఇఒ ఆర్.వెంకటరామన్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ఐదో షెడ్యూల్డ్‌లో చేర్చగలరా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

నిన్నగాక మొన్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం బాగుజోల గిరిజన గ్రామాన్ని సందర్శించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా బాగుజోల - సిరివర గ్రామాల మధ్య నిర్మించనున్న రహదారితో పాటు పలు గ్రామాల సౌకర్యార్థం తలపెట్టిన రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. గిరిజన ప్రాంతంలో తాగునీరు, రహదారి సదుపాయాలు మెరుగుపర్చడంతోపాటు ఉపాధి కల్పనకు కృషి చేస్తానని, ముఖ్యంగా వైద్య సదుపాయాల కోసం డోలిమోతల దుస్థితి లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రకటనలను కేవలం గిరిజనులు మాత్రమే కాదు, యావత్తు ఉమ్మడి విజయనగరం జిల్లా స్వాగతిస్తోంది. కానీ, ఈ సదుపాయాలకు అంతలా నిధులు కేటాయించా లన్నా, గిరిజనులకు మరిన్ని సంక్షేమ పథకాలు వర్తించాలన్నా, చివరకు గిరిజన ప్రాంతంలో గిరిజనేతరుల పెత్తనం కట్టడిచేయాలన్నా 5వ షెడ్యూల్ ఏరియాల ఉన్నవాటికి మాత్రమే సాధ్యమౌతుంది. మరి ప్రభుత్వం అందుకు సిద్ధపడుతుందా? లేదా? అన్న చర్చ పవన్ కల్యాణ్ పర్యటన నేపథ్యంలో పబ్లిక్ టాక్‌గా నిలిచింది. ఇందుకు కారణం లేకపోలేదు. 5వ షెడ్యూల్ ఏరియా పెంపునకు పాలక పార్టీల్లో ఇన్నాళ్లూ రాజకీయ చిత్తశుద్ధి కొరవడింది. దీంతో, గిరిజన ప్రాంతంలోని భూములు, అటవీ, ఖనిజ సంపద లూటీ అవుతున్నాయి. ముఖ్యంగా 1/70 చట్టం వర్తించక పోవడంతో ఏజెన్సీలోని భూములు చాలా వరకు స్థానికేతర గిరిజనేతరులు చేతుల్లోకి పోతున్నాయి. గిరిజన ప్రాంతంలో పుట్టి, పెరిగినా ఆయా గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చక పోవడం వల్ల కొండలు, డి-పట్టా భూములు ఆక్రమి ంచుకోవడం వంటివి యథేచ్ఛగా సాగిపోతున్నాయి. చివరికి రాజ్యాంగం కల్పించిన హక్కులు, సంక్షేమ పథకాలను సైతం గిరిజనులు పొందలేక పోతున్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక గిరిజనుల హక్కులు మరింతగా హరించి పోతున్నాయి. నోరు మెదిపితే బిజెపి, అందులో కీలకంగావున్న ప్రధాని మోడీ, హోం శాఖ మంత్రి అమిత్‌షా జపం చేస్తున్న పవన్ కల్యాణ్ మరి ఇప్పుడు వారిని ఒప్పించి, కేంద్ర ప్రభుత్వం వద్ద ఉన్న పలుకుబడి ఉపయోగించి, సమస్య పరిష్కారానికి చొరవ చూపగలరా? అన్నదానిపై బహిరంగంగానే చర్చ నడుస్తోంది.



వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పాముల పుష్పశ్రీవాణి అధ్యక్షతన 2019 నవంబర్ 12న జరిగిన గిరిజన సలహా మండలి సమావేశం 554గ్రామాలను 5వ షెడ్యూల్‌లో చేర్పించేందుకు తీర్మానించింది. ఇందులో ఉమ్మడి విజయనగరం జిల్లాలో 182, శ్రీకాకుళం జిల్లాలో 240, విశాఖలో 91, తూర్పుగోదావరిలో 40, పశ్చిమగోదావరి జిల్లాలో ఒక గ్రామం చొప్పున ఉన్నాయి. ఈ ప్రకటనకు 20 రోజుల వ్యవధిలో అప్పటి ప్రభుత్వం (గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పుష్పశ్రీవాణి) యూటర్న్ తీసుకున్నారు. ప్రతిపాదిత షెడ్యూల్ గ్రామాల్లో కొన్నిచోట్ల అభ్యంతరాలు, మరికొన్ని గుర్తించాల్సిన గ్రామాలు ఉన్నాయని, ఈ నేపథ్యంలో రీసర్వే చేస్తామని 2019 డిసెంబర్ 2న పుష్పశ్రీవాణి ప్రకటన చేశారు. ఇందులో వాస్తవం ఉన్నప్పటికీ, సర్వే నివేదిక 35ఏళ్ల క్రితం నాటిదని కొత్తగా చెప్పడం పట్ల అప్పట్లో పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వాస్తవానికి ఈ సమస్యపై దశాబ్ధాలు తరబడి పాలక పార్టీలకు చిత్తశుద్ధి లేకపోయినప్పటికీ ఉమ్మడి రాష్ట్రంలో ఎపి గిరిజన సంఘం అనేక సర్వేలు చేపట్టింది. సుమారు 1200 గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్పించాల్సిందని అంచనాలు రూపొందించింది. రాష్ట్ర విభజన తరువాత విస్తీర్ణం, జనాభా రీత్యా దాదాపు 700 గ్రామాలను ప్రతిపాదించాల్సి వుందని గిరిజన సంఘాలు చెబుతున్నాయి.

సాలూరు మండలంలో 90 రెవెన్యూ గ్రామాలు ఉండగా, షెడ్యూల్ ఏరియాలోవున్నవి 24 మాత్రమే ఉన్నాయి. ప్రతిపాదిత గ్రామాలు 44 ఉన్నప్పటికీ మరో పది గ్రామాల వారు షెడ్యూల్ ఏరియాలో చేర్పించాలని డిమాండ్ చేస్తున్నారు. మక్కువ మండలంలో 21పంచాయతీల పరిధిలో సుమారు 54 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఇందులో కేవలం శంబర గ్రామానికి చెందిన బీరమాసి ఒక్కటే షెడ్యూల్ ఏరియా పరిధిలోవుంది. మండలం మొత్తం అటవీ ప్రాంతంలో ఉండడం, మెజార్టీ గ్రామాల్లో ఎక్కువ మంది గిరిజనులు ఉండడం వల్ల 52గ్రామాలు షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని గిరిజన సంఘాలు ఏళ్లతరబడి డిమాండ్ చేస్తుండగా గిరిజన సలహా మండలి ప్రతిపాదనలో కేవలం 26 మాత్రమే ఉండడం గమనార్హం. పాచిపెంట మండలంలో 54 రెవెన్యూ గ్రామాలకుగాను ప్రస్తుతం 21గ్రామాలు మాత్రమే షెడ్యూల్ ఏరియాలో ఉన్నాయి. మిగిలిన అత్యధిక గ్రామాల్లో గిరిజన జనాభాయే ఎక్కువగా ఉన్నప్పటికీ ఇటీవల కేవలం 17 గ్రామాలను మాత్రమే షెడ్యూల్ ప్రాంతంలో చేర్పించేందుకు ప్రతిపాదించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గిరిజన మండలాల్లోనూ ఇదే పరిస్థితి దాపురించింది. 5వ షెడ్యూల్ పరిధిలో ఉంటే గిరిజన ప్రాతంలోని అటవీ సంపద, పార్వతీపురం మండలం బడిదేవర కొండ, సాలూరు మండలం తామరకొండల్లోని గ్రానైట్ సహా అనేక చోట్ల నిక్షిప్తమైవున్న గనులు కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడం అంత సులువు కాదు. ఇప్పటికే గిరిజన ప్రాంతాల్లో తిష్టవేసి, అటవీ సందపద, విలువైన భూములు ఆక్రమించుకున్న ధనికులు, పెట్టుబడిదారులకు ఇబ్బంది కలుగుతుంది. వారి ప్రయోజనాల కోసమే గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్‌లో చేర్పించేందుకు బిజెపి మీనమేషాలు లెక్కిస్తోంది. దీంతో, గిరిజనులకు ఐటిడిఎ పథకాలు కూడా వర్తించని దుస్థితి ఉంది. అయినప్పటికీ జగన్, చంద్రబాబు ప్రభుత్వాలు కూడా కేంద్రంపై ఒత్తిడి చేయలేదు. నేడు డిప్యూటీ సిఎంగా అందలమెక్కిన పవన్ కల్యాణ్ అందుకు కృషి చేయగలరా? అని జనం చర్చించుకుంటున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి వైస్ ఛైర్మన్ జగన్మోహన్‌రావు

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- సంతకవిటి

స్తానిక మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. జెడ్‌పి వైస్ ఛైర్మన్ సిరిపురపు జగన్మోహన్‌రావు, ఎంపిపి మంజు, ఎంపిడిఒ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీకి ఆదర్శ పాఠశాల విద్యార్థి

ప్రజాశక్తి- మెరకముడిదాం

నేషనల్ కన్స్యూమర్ డే వారోత్సవాలు సందర్భంగా జిల్లాస్థాయిలో జరిగిన వ్యాసరచన (ఆంగ్లం) పోటీలలో గర్భాం ఆదర్శ పాఠశాలకు చెందిన ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థి బి. ఉమాదేవి జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి సాధించి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డివిఎస్ అరుణ తెలిపారు. వక్తృత్వం (ఆంగ్లం) పోటీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరానికి చెందిన ఏ. పవిత్ర, వ్యాసరచన (తెలుగు)పోటీలో ఇంటర్ ప్రథమ విద్యార్థి డి.శృతి తృతీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఉమాదేవి రాష్ట్ర స్థాయిలో కూడా విజయం సాధించాలని ప్రిన్సిపాల్ ఆకాక్షించారు. విద్యార్థులకు గైడ్‌గా వ్యవహరించిన గీతా అన్నపూర్ణను అభినందించారు.

డైట్‌లో జాతీయ గణిత దినోత్సవం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక ప్రభుత్వం ఉపాధ్యాయ శిక్షణా సంస్థ (డైట్)లో జాతీయ గణిత, ధ్యాన దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జి. పగడాలమ్మ గణిత, ధ్యాన మేళాను ప్రారంభించి విద్యార్థుల ప్రదర్శన తిలకించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె. రామకృష్ణారావు, అధ్యాపకులు పి.రవి కుమార్, కె.సూర్యారావు, మాత రామకృష్ణ పాల్గొన్నారు.

ఖైదీలకు చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

స్థానిక సబ్‌జైలులో ఖైదీలకు శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ్ చక్రవర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి టివి రాజేష్ కుమార్ చట్టాలపై అవగాహన కల్పించారు. 70ఏళ్ల పైబడిన వృద్ధులు, అస్వస్థతతో ఉన్న ఖైదీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సబ్ జైల్లో కొనసాగుతున్న జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను తనిఖీ చేశారు. పారా లీగల్ వాలంటీర్లు నిర్వహిస్తున్న విధులను గురించి ఆరా తీశారు. జైలులో ఉన్న ముద్దాయిలకు సకాలంలో న్యాయ సహాయం అందించడానికి జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్లను ఏర్పాటు చేశామని, వాటిని సక్రమంగా కొనసాగించాలని తెలిపారు. జైల్లో ఉన్న ముద్దాయిలకు ఉచిత న్యాయ సహాయం అందించడమే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ముఖ్య కర్తవ్యం అని అన్నారు.

మెప్మా కార్యక్రమాలు నూరుశాతం అమలు చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రానున్న 100 రోజుల్లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలు శతశాతం విజయవంతం అయ్యేలా చూడాలని కమిషనర్ పల్లి నల్లనయ్య సిబ్బందికి ఆదేశించారు. డిసెంబర్ 22 నుంచి వచ్చే మార్చి 31 వరకు వంద రోజులపాటు జీవనోపాధి జాతర పేరిట 25 ప్రధాన అంశాలతో కార్యచరణ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. వంద రోజులపాటు డ్వాక్రా మహిళలు, ఔత్సాహికులను ప్రోత్సహించే విధంగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

తూర్పుకాపుల సంక్షేమానికి కృషి చేయండి

ప్రజాశక్తి-విజయనగరం కోట

తూర్పు కాపుల సంక్షేమానికి అన్ని విధాలుగా దృషి చేయాలని తూర్పు కాపు కార్పొరేషన్ ఛైర్మన్ యశస్విని టిడిపి జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున కోరారు. శనివారం యశస్విని నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ కృషి చేస్తున్నారన్నారు. తూర్పు కాపుల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని కోరారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు

బొబ్బిలి : పట్టణంలోని ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో సిఇఒ శ్రీనివాసన్ ఆధ్వర్యాన శనివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కేక్‌ను కారుణ్య ఫౌండేషన్ ఛైర్మన్ జెసి రాజు కట్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

24న కలప, రాడ్ల వేలం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగం ద్వారా అనధికార ఫ్లెక్సీలు, బోర్డులు తొలగింపు ప్రక్రియలో భాగంగా సేకరించబడిన సరుగుడు రాటలు, పోస్టులు సుమారు 8 టన్నుల బరువు గల కలపను విక్రయించేందుకు ఈనెల 24న మధ్యాహ్నం 3గంటలకు బహిరంగ వేలం వేయనున్నట్లు కమిషనర్ నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు కార్పొరేషన్ కార్యాలయంలో జరిగే వేలం పాటలో పాల్గొనాలని కోరారు. వివరాలకు ఫోన్ నెంబరు 9849907016ను సంప్రదించాలని తెలిపారు.

పలువురికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు శనివారం పలువురు వైసిపి నాయకుల కుటుంబాలను పరామర్శించారు. దన్నాన పేటలో వైసిపి నాయకులు తర్లాడ దుర్గారావు, నగర పంచాయతీలో బూర సత్తిబాబు తండ్రులు మృతి చెందడంతో వారి కుటుంబాలను పరామర్శించారు.

ఉపాధ్యాయుడికి కవితా ప్రశంసా పత్రం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మొయిద జెడ్‌పి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కాళ్ల అప్పారావుకు శనివారం వ్యాకరణ విద్వాంసుడు పరవస్తు చిన్నయసూరి కవితకు ప్రశంసా పత్రం లభించింది. చిన్నయసూరి 218వ జయంతి పురష్కరించుకొని సాహితి చైతన్య కిరణాలు ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఆన్‌లైన్ కవి సమ్మేళనంలో ఉపాధ్యాయులు అప్పారావు పాల్గొనడంతో 'వ్యాకరణ విద్వాంసుడు సూరి కవితకు ప్రశంసా పత్రం, జ్ఞాపిక లభించింది. ఈ సందర్భంగా ఆయనను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

రైలు ఢీకొని 10 మేకలు మృతి

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

రైలు ఢీకొని 10 మేకలు మృతిచెందాయి. ఈ సంఘటన మండలంలోని దిబ్బగుడ్డివలస రైల్వేగేటు వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. దిబ్బగుడ్డివలస గ్రామానికి చెందిన కోడిబోయిన గంగులు మేకలను మేతకు తీసుకెళ్లి, ఇంటికి తిరిగి తోలుకొస్తున్నాడు. దిబ్బగుడ్డివలస గ్రామానికి ముందున్న రైల్వేగేటు దాటుతుండగా రైలు ఢీకొనడంతో 10 మేకలు మరణించాయి. సుమారు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లింది. దీంతో పెంపకందారుడు గంగులు కన్నీరు మున్నీరయ్యాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

వృద్ధాశ్రమానికి తరలించిన మహిళ మృతి

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని పూల్‌బాగ్‌లోగల ప్రేమసమాజంలో ఓ మహిళ అనారోగ్యంతో మృతి చెందినట్లు టూటౌన్ సిఐ శ్రీనివాసరావు తెలిపారు. రెండు రోజుల క్రితం ఓ వృద్ధురాలు (60), ఆరోగ్యం బాగోలేక రోడ్డు పక్కన ఉంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆమెను ప్రేమ సమాజంలో ఏర్పించారు. ఆమె పేరు జాగా సత్తమ్మ గరివిడి ప్రాంతమని తెలిసిందన్నారు. ఆచూకీ తెలిసిన వారు రూరల్ ఎస్ఐ కృష్ణమూర్తిని (9121109438) సంప్రదించాలని తెలిపారు. మృతదేహాన్ని మిమ్స్‌ఆసుపత్రిలో ఉంచినట్లు తెలిపారు.

అభిరుచులకు అనుగుణంగా నడిస్తే విజయం

• నయంత విశ్వవిద్యాలయం సిఇఒ రంజన్ బెనర్జీ • ఘనంగా సెంచూరియన్ 4వ స్నాతకోత్సవం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఏ రంగంలోనైనా విద్యార్థులు తమ అభిరుచులకు అనుగుణంగా కృషి చేసినపుడే గొప్ప విజయాలు సాధించగలరని నయంత విశ్వవిద్యాలయం సిఇఒ ప్రొఫెసర్ రంజన్ బెనర్జీ అన్నారు. శనివారం సెంచూరియన్ విశ్వవిద్యాలయం 4వ స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మనం ఇతరుల జీవితాల్లో చిరునవ్వులు చూడగలిగినపుడే మనం గొప్ప విజయాలను సాధించినవారమవుతామని అభిప్రాయపడ్డారు. అందుకు తన విజయగాథను వివరించారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయం అధ్యక్షులు ప్రొఫెసర్ ముక్తికాంత్ మిశ్రా విద్యార్థులు సాధించిన విజయాలను ప్రశంసించారు. విద్యావేత్తలు, పరిశోధన, ఆవిష్కరణలలో ప్రపంచ ప్రమాణాల ఆవశ్యకతను వివరించారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ డి.ఎన్.రావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో విద్య సమగ్ర పాఠ్యాంశాలు, ఇంటర్ డిసిప్లినరీ రీసెర్చ్ అండ్ లెర్నింగ్ చుట్టూ తిరుగుతుందన్నారు.

మీరే బ్రాండ్ అంబాసిడర్లు

మీ జీవితాలకు మీరే బ్రాండ్ అంబాసిడర్లు అని సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు యువతనుద్దేశించి అన్నారు. ఇక్కడ ప్రపంచస్థాయి ప్రమాణాలతో నాణ్యమైన విద్యను అందిస్తొన్నందుకు గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భువనేశ్వర్ సెంచూరియన్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సుప్రియ పట్నాయక్, ఎపి క్యాంపస్ రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, పాలకమండలి సభ్యులు పారిశ్రామికవేత్త కుమార్ రాజా, డాక్టర్ పి.ఎస్.ఠాగూర్, ప్రొఫెసర్ కె.సి.బి.రావు, పిఎన్ఎస్వి నరసింహం, ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, ప్రొఫెసర్ రమణారావు, డీన్లు డాక్టర్ సన్నీడయాల్, డాక్టర్ విజయ్‌బాబు, డాక్టర్ పుష్పలత, డాక్టర్ ఆర్.ఎస్.వర్మ, డాక్టర్ అనీల్ కుమార్, ప్రొఫెసర్ శాంతమ్మ, పలువురు అధ్యాపకులు, దేచిరాజు పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు డిగ్రీపట్టాలు ప్రదానం చేస్తున్న ప్రొఫెసర్ రంజన్ బెనర్జీ తదితరులు

వరి పొలాలు పరిశీలన

ప్రజాశక్తి - భోగాపురం

అకాల వర్షం కారణంగా దెబ్బతన వరి పంట పొలాలను వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఎపి రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు శనివారం పరిశీలించారు. మండలంలోని పోలిపల్లి గ్రామంలో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. వరి పనలు నీటిలో మునిగినందున పంట దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆయనకు విన్నవించుకున్నారు. దీనిపై ఆయన స్పందించి దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించాలని వ్యవసాయ అధికారి హరికృష్ణకు సూచించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పంటల భీమా నమోదు చేసుకోవాలి

నెల్లిమర్ల : అపరాలు, మొక్కజొన్న, వరి పంటలు వేసిన రైతులు పంటల బీమా చేసుకోవాలని ఎఒ ఎం. పూర్ణిమ తెలిపారు సూచించారు. వాటి నమోదుకు రైతులు బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డు, భూమి పాస్ బుక్ జెరాక్స్‌లు, పంట చేసినట్టు ధ్రువీకరణ పత్రం, ఏరియాస్ సోన్ సర్టిఫికెట్‌ని గ్రామ వ్యవసాయ సహాయకులు ద్వారా తీసుకొని ధ్రువీకరించుకొని బ్యాంకు, మీసేవ కేంద్రానికి గాని కామన్ సర్వీస్ సెంటర్‌కి వెళ్లి ఈ నెల 31లోగా నమోదు చేసుకోవాలన్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

వంగర: పొలాల్లో నీటి నిల్వ లేకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలని ఎఒ టి. కన్నబాబు అన్నారు. మండలంలోని మద్ది వలస, కొప్పర కొత్తవలస, ఎం సీతారాంపురం తదితర గ్రామాలలో ఆయన శనివారం పర్యటించి మొక్కజొన్న, అపరాలు పొలాలలో ఉన్న నీటిని తొలగించాలని రైతులుకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నీట మునిగిన పంటల పరిశీలన

గజపతినగరం : మండలంలో వర్షాల వల్ల ముంపునకు గురైన మొక్కజొన్న, అపరాల పంటలను ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ కె.లక్ష్మణ్, శాస్త్రవేత్త ఎం.ఎం.వి.శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ ఎడి కె.మహారాజన్, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి గోవిందమ్మ, ఎఒ ధనలక్ష్మి పరిశీలించారు. శనివారం మండలంలోని కొత్తశ్రీరంగరాజపురం, తుమ్మికాపల్లి, లోగిశ గ్రామాల్లో వారు పర్యటించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు సూచించారు. కార్యక్రమంలో విఎఎలు ప్రమీల, జ్యోత్స్న పాల్గొన్నారు.



ఛైర్మన్, వైస్ ఛైర్మన్లకు నియామక పత్రాలు అందజేస్తున్న అధికారులు

ప్రాజెక్టులకు అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక

ప్రజాశక్తి-గజపతినగరం

ఆండ్ర, తాటిపూడి ప్రాజెక్టులకు ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక నిర్వహించారు. కూటమి ప్రభుత్వం బలపరిచిన అభ్యర్థులు ఎన్నికయ్యారు. తాటిపూడి ప్రాజెక్టు ఛైర్మన్‌గా కళ్లెంపూడి జనార్ధనరావు, వైస్ ఛైర్మన్‌గా లగుడు ఎర్నాయుడు, ఆండ్ర ప్రాజెక్టు ఛైర్మన్‌గా కోడి సతీష్‌కుమార్, వైస్ ఛైర్మన్‌గా పడాల గంగునాయుడు ఎన్నికయ్యారు. వారికి అధికారులు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మక్కువ శ్రీధర్, పి.వి.వి గోపాలరాజు, వై.ప్రదీప్ కుమార్, గుంట్రోతు గోవింద పాల్గొన్నారు.

పారాది ఆనకట్ట స్కీమ్ ఎన్నిక ప్రశాంతం

బొబ్బిలి : స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో పారాది ఆనకట్ట స్కీమ్ ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. ఛైర్మన్‌గా పెంట సత్యనారాయణ, వైస్ ఛైర్మన్‌గా బేతనపల్లి రమణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇద్దరూ టిడిపి మద్దతుదారులే. వారికి ధ్రువపత్రాలను ఆర్‌డిఒ రామ్మోహనరావు అందజేశారు. . కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, ఇరిగేషన్ డిఇ నారాయణరావు, జెఇ సుధీర్ పాల్గొన్నారు.

23న వేపాడ మండల సమావేశం

వేపాడ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఈ నెల 23న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సిహెచ్.సూర్యనారాయణ తెలిపారు. ఎంపిపి సత్యవంతుడు ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశానికి సభ్యులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎంపిటిసి గొంప తులసి

రెవెన్యూ సదస్సులు వినియోగించుకోవాలి

వేపాడ : మండలంలోని ఎం.సింగవరం, బానాది గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ముందుగా గ్రామాల్లో అవగాహన ర్యాలీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపిటిసి గొంప తులసి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎం.సింగవరంలో మ్యుటేషన్లకు 10, బానాదిలో 4 దరఖాస్తులు వచ్చాయని తహశీల్దార్ జె.రాములమ్మ తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, సర్పంచ్ కర్రి యశోద, టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, ఎంఆర్ఐ రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ద్వారపురెడ్డిపాలెంలో రెవెన్యూ సదస్సు

డెంకాడ : మండలంలోని ద్వారపురెడ్డిపాలెంలో జరిగిన రెవెన్యూ సదస్సులో టిడిపి సీనియర్ నాయకులు కంది చంద్రశేఖరరావు మాట్లాడుతూ దీర్ఘకాలంగా ఉన్న భూ సమస్యలు, వివాదాల పరిష్కారమే అజెండాగా రెవెన్యూ సదస్సులను కూటమి ప్రభుత్వం చేపడుతోందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ పద్మావతి, సర్పంచ్ కనకరాజు, జనసేన నాయకులు మహంతి నర్సినాయుడు, నగరపు సూరిబాబు, మహంతి చిన్న, తొత్తిడి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సదస్సులతోనే పరిష్కారం

విజయనగరం కోట : రెవెన్యూ సదస్సులతోనే రైతులు భూ సమస్యలు పరిష్కారం చేసుకోవచ్చని ఆర్ఐ ఎస్ ఎస్ ఎన్ రాజు తెలిపారు. విటి అగ్రహారంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి పలు వివాదాలకు సంబంధించి వినతులు స్వీకరించారు. టౌన్ సర్వేయర్ సింహాచలం, మున్సిపల్ ఎసిపి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మరుభూమికి పాట్లు

శ్మశాన వాటిక లేక చిన్నయ్య పేట గ్రామస్తులు ఇబ్బందులు

వృద్ధుడు ఎర్రయ్య మృతితో షెడ్డు ఏర్పాటు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి గ్రామపంచాయతీ పరిధి చిన్నయ్య పేటలో మరు భూమి లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం ఎర్రయ్య అనే వృద్ధుడు మృతి చెందడంతో అంత్యక్రియలకు తీసుకువెళ్లేందుకు వర్షాలు కారణంగా ఇబ్బందులు పడ్డారు. గ్రామంలో శ్మశాన వాటిక లేక ఎర్రయ్య మృతదేహానికి అంత్యక్రియలకు ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో వర్షంలో గొడుగులు పట్టుకుని కర్రలు, రేకులు నిర్మాణంతో షెడ్డు ఏర్పాటు చేసి అంత్యక్రియలు చేపట్టారు. తమ గ్రామానికి శ్మశాన వాటిక లేక ఇబ్బందులు పడుతున్నామని ఎన్నోసార్లు అధికారులకు, పంచాయతీ పాలకవర్గానికి విన్నవించినా ఫలితం లేదని గ్రామస్తులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు, పంచాయతీ పాలకవర్గం స్పందించి శ్మశాన వాటిక నిర్మించాలని కోరారు.



ఘనంగా వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు





వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు శనివారం జిల్లా అంతటా ఘనంగా నిర్వహించారు. బొబ్బిలిలో మాజీఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు కేక్ కట్‌చేశారు. విజయనగరంలో వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు.

భూ హక్కు పత్రాలు అందించేందుకు చర్యలు

ప్రజాశక్తి-బొండపల్లి

రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చే అర్జీలను పరిశీలించి రైతులకు భూహక్కు పత్రాలు అందించేందుకు కృషి చేస్తామని తహశీల్దార్ డి.రాజేశ్వరరావు తెలిపారు. శనివారం మండలంలోని ముద్దూరు, తమటాడ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. మండల నోడల్ అధికారి ఎ.వి.సాల్మన్‌రాజు పరిశీలించారు. ఆర్ఐ హరికృష్ణ, సర్పంచ్ ఎం పైడపునాయుడు, విఆర్ఒ పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న గజరాయునివలస ఎంపిటిసి పాలవలస గౌరు

'రెవెన్యూ' తీరుపై సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి-బాడంగి

రెవెన్యూ అధికారుల తీరుపై మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి బి.గౌరి ఆధ్వర్యాన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గజరాయునివలస ఎంపిటిసి పాలవలస గౌరు మాట్లాడుతూ రెవెన్యూ అధికారుల తీరుపై విరుచుకుపడ్డారు. పెట్రోల్ బంకు ఏర్పాటుపై మ్యుటేషన్ సమస్య పరిష్కరించాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ఇచ్చిన ఆదేశాలను తహశీల్దార్, మండల సర్వేయర్, గొల్లాది సచివాలయ సర్వేయర్ బేఖాతరు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సమస్య పరిష్కరించాలని చెప్పి ఆరు రోజులు గడిచినా జాప్యం చేస్తున్నారు తప్ప దాని పరిష్కారంపై దృష్టిపెట్టడం లేదని మండిపడ్డారు. మ్యుటేషన్‌కు సంబంధించి కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ స్పష్టంగా ఆదేశాలు జారీచేసినా, మండల స్థాయిలో రెవెన్యూ అధికారులు ఒకరిపై ఒకరు నెట్టుకొంటూ సమస్యను ఇంకా పరిష్కరించక పోవడం సరికాదన్నారు. కలెక్టర్ ఆదేశాలనే పట్టించుకోకుంటే ఎలా? అని సమావేశంలో అధికారులను నిలదీశారు. వైస్ ఎంపిపి సింగిరెడ్డి భాస్కరరావు, మిగతా సభ్యులు సైతం గౌరుకు మద్దతుగా నిలిచారు. పెట్రోల్ బంక్ సమస్యను కొన్ని నెలలుగా రెవెన్యూ అధికారులు పరిష్కరించకపోవడం దారుణమన్నారు. వెంటనే సమస్య పరిష్కరించకుంటే, తహశీల్దార్ కార్యాలయం వద్ద తామంతా ధర్నా చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జెడ్‌పిటిసి పి.రామారావు, ఎంపిడిఒ ఎస్.రామకృష్ణ, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు

10లోగా సార్వత్రిక విద్యాపీఠం టెన్త్ పరీక్ష ఫీజు చెల్లించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యాన నిర్వహించే టెన్త్ పరీక్షకు జనవరి 10లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని డిఇఒ యు.మాణిక్యం నాయుడు తెలిపారు. అభ్యాసకులు ఏదైనా ఆఫ్‌లైన్ సేవా కేంద్రం లేదా ఆన్‌లైన్ ద్వారా గాని నేరుగా చెల్లించవచ్చునని తెలిపారు. వెబ్‌సైట్ www.apopenschool.ap.gov.in అందుబాటులో ఉందన్నారు. ప్రతి ఒక సబ్జెక్టుకు రూ.25 అపరాధ రుసుముతో జనవరి 4 వరకు, రూ.50 అపరాధ రుసుముతో 8వ తేదీ వరకు చెల్లించవచ్చునని తెలిపారు. తత్కాల్ రుసుము టెన్త్‌కు రూ.500, ఇంటర్‌కు రూ.1000 ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు.

విక్టరీ పాఠశాలలో గణిత దినోత్సవం

వేపాడ : వేపాడలోని శ్రీవిక్టరీ ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవ సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటుచేసిన గణిత ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్యేక బృందాలతో పారిశుధ్య పనులు

విజయనగరం టౌన్ : నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో నగరంలో ప్రత్యేక పారిశుధ్య బృందంతో చెత్తాచెదారాల ప్రక్షాళన కార్యక్రమం కొనసాగుతోంది. ప్రధాన కాలువల్లో కూడా పూడికతీతలను ముమ్మరం చేసారు. వాహనాలు వెళ్ళలేని సందులలో పారిశుధ్య కార్మికులతో చెత్తలను తొలగిస్తున్నారు.

సీతం కాలేజీలో ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు కెటియా – ఉత్పత్తి రూపకల్పన అనే అంశంపై ఆరు రోజుల కార్యశాల ముగిసింది. స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ తోడ్పాటు తో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సంస్థకు చెందిన ట్రైనర్ ప్రసన్నలక్ష్మి విడి బాగాల డ్రాయింగ్‌ను, వాటి మెళ కువలను నేర్పించారు కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ్ వర్క్‌షాప్ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి, మెకానికల్ విభాగాధిపతి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్ పాటించడం లేదు

మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఫిర్యాదు

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

కూటమి ప్రభుత్వం వచ్చాక సర్పంచులకు, ఎంపిటిసిలకు అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు సమాచారం ఇవ్వడం లేదని కమ్మవలస సర్పంచ్ వసుంధర... మండల సర్వసభ్య సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి శంబంగి లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో వైసిపి సభ్యులు మాట్లాడుతూ అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని చెప్పారు. దీనిపై టిడిపి ఎంపిటిసి సభ్యులు నాగరాజు స్పందిస్తూ గత ప్రభుత్వంలో కూడా ఇలానే చేశారని గుర్తుచేశారు. సిహెచ్ బొడ్డవలస పంచాయతీకి రెండు ఆశా పోస్టులు కావాలని, ఇదే గ్రామంలో ఏడాదిన్నరగా ఎస్‌సి కాలనీకి, బిసి కాలనీలో సగం వీధులకు తాగునీరు అందడం లేదని ఎంపిటిసి ప్రతినిధి శివరామకృష్ణ తెలిపారు. పై సమస్యలపై తీర్మానిస్తే, వెంటనే ఆశా పోస్టులు మంజూరు చేస్తామని పిరిడి పిహెచ్‌సి వైద్యులు వంశీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సహిత విద్యను బలోపేతం చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

క్షేత్రస్థాయిలో సహిత విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని బొబ్బిలి డివిజన్ ఉప విద్యాశాఖధికారి కె. మోహనరావు అన్నారు. శనివారం స్థానిక డిఆర్‌డిఎ ఆడిటోరియంలో జిల్లా సమగ్ర శిక్షా, విద్యాశాఖ ఆధ్వర్యంలో సహిత విద్యను బలోపేతం చేసేందుకు మండల విద్యాశాఖ అధికారులకు ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ పాఠశాలలో సాధారణ విద్యార్థులతో పాటు ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు కూడా కలిసి చదువుకోవడమే సహిత విద్యా విధానం లక్ష్యమన్నారు. ఇందుకోసం ప్రభుత్వం పాఠశాలలో అనేక మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసిందన్నారు. అలాగే వికలాంగ విద్యార్థుల మేధాస్థాయికి అనుగుణంగా విద్యాబోధన జరుగుతుందన్నారు. పాఠశాలలో అందే సేవలన్నీ ప్రత్యేక అవసరాలు పంపిణీ పిల్లలకు అందేలా మండలవిద్యాశాఖ అధికారులు చూడాలని ఆయన కోరారు. ఐఇఆర్‌పిలకు, స్పెషల్ ఎడ్యుకేటర్లకు స్కూల్ కాంప్లెక్స్ మాదిరి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. రిసోర్స్ పర్సన్లు ఈశ్వరరావు, సునీల్ కుమార్ లు సహిత విద్య విధానాలను వివరించారు.జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ ఎస్. సూర్యారావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఇఒలు, వైద్య శాఖ తరపున డాక్టర్ ఆదిత్య, ఐసీడీఎస్ అధికారి జి.ప్రసన్న, జిల్లా సహిత విద్య సహ కోఆర్డినేటర్ ఎం. భారతి, సమగ్ర శిక్షా సిబ్బంది పాల్గొన్నారు.